ట్రా'ఫికర్'

- వ్యాపారులకు అడ్డాగా తాండవ వంతెన
- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా షాపుల ఏర్పాటు
- వాహనాల రాకపోకలకు నిరంతరం అంతరాయం



తాండవ బ్రిడ్జిపై చేపల అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు

పాయకరావుపేట: తుని, పాయకరావుపేటను అనుసంధానం చేసే తాండవ నది బ్రిడ్జి వ్యాపారులకు అడ్డాగా మారింది. బ్రిడ్జికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై పండ్లు, చేపలు, కూరగాయలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో వెళ్తున్న వారు మరింత ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పాయకరావుపేటకు నిత్యం చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాయకరావుపేట నుంచి తునికి, తుని నుంచి పాయకరావుపేటకు వేలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. తునిలోని విద్యా సంస్థలకు పాయకరావుపేట నుంచి విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా వెళ్తుంటారు. వంతెనకు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లపై చిల్లర వర్తకులు దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌లపై ప్రయాణించడానికి వీల్లేకుండా పోయింది. వంతెన మధ్యలో నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పండ్లు, చేపలు, కూరగాయల కొనుగోలు కోసం ప్రజలు గుంపులుగా చేరడంతో



వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

ద్విచక్ర వాహనాలు, ఆటోలు, స్కూల్ బస్సులు, కార్లు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ముఖ్యంగా విద్యార్థులు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫుట్‌పాత్‌లపై శాశ్వతంగా పండ్లు దుకాణాలు, చిల్లర వర్తకులు కూడా స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి తాండవ వంతెనపై ఇరువైపులా ఉన్న అనధికారిక షాపులను తొలగించి, ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక సీఐ జి.అప్పన్నను సంప్రదించగా.. వంతెనపై దుకాణాలు ఏర్పాటు చేయకుండా దృష్టి సారిస్తామన్నారు.

క్లుప్తంగా

సామాజిక ప్రజావేదిక నేడు

కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24లో మండలంలోని 25 పంచాయతీలలో చేపట్టిన పనులపై ఈ ప్రజావేదిక ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రజావేదికలో సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై విచారణ ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న గ్యార్వీ షరీఫ్ వేడుకలు



చందనం ఊరేగింపులో యువకుల సందడి

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో గ్యార్వీ షరీఫ్ వేడుకలు రెండో రోజు సోమవారం ఘనంగా జరిగాయి. మసీద్ ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో యువకులు సందడి చేశారు. చందనం ఊరేగింపులో డీజే సౌండ్స్ నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. గౌస్ పాక్ నిషానీ వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

నేవల్ బేస్ ప్రధాన రోడ్డును పునర్నిర్మించాలి



మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే పునర్నిర్మించాలని సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం రాంబిల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి నేవల్ బేస్‌కు వెళ్లే వరకు రోడ్డు పూర్తిగా గోతులమయమైందన్నారు. ఇటీవల ప్రజా సంఘాల నేతలు అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో ఆ గోతుల్లో అధికారులు క్రషర్ బుగ్గ వేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. భారీ వాహనాల రాకపోకలు కారణంగా ఈ రోడ్డు దెబ్బతిందని చెప్పారు. అధికారులు స్పందించి రాంబిల్లి ప్రధాన రహదారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్ష

అచ్యుతాపురం: మండలంలో చేపడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనుల పురోగతిపై ఎంపీడీవో ప్రభాకర్‌రావు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఏఈ పైడంనాయుడు, ఏపీవో వసంత్‌కుమార్‌లతో తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించి ప్రస్తుతం చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలం పరిధిలో 32 పనులకు ఆమోదం రాగా, ఆరు పనులు పురోగతిలో ఉన్నట్టు ఏపీవో తెలిపారు.

పూడిమడక కార్యదర్శిపై ఫిర్యాదు

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని పూడిమడక పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎరిపల్లి కాసులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో కొందరు అనుమతులు లేకుండా లే అవుట్‌లు వేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల దర్యాప్తు చేపట్టిన అధికారుల బృందంలోని సభ్యుడైన కార్యదర్శి తప్పుడు నివేదిక ఇచ్చారని, చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రామభద్రపురంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని రామభద్రపురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో అనధికారికంగా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి తన సిబ్బందితో ఎస్ఐ దాడి చేశారు. ఈ దాడిలో రూ.74,143 విలువ చేసే మందుగుండును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అభిజిత్ కంపెనీని వెంటనే తెరవాలి



అభిజిత్ పరిశ్రమ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో అభిజిత్ పరిశ్రమను వెంటనే తెరవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమండ్ చేశారు. ఈ మేరకు కంపెనీ గేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ మూసివేతతో రోడ్డున పడ్డ కార్మికులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారుల నుంచి స్పందన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ లే-ఆఫ్‌ను ఎత్తి వేయాలని కోరారు. సెజ్‌లలో పలు కంపెనీలు తక్కువ ధరకే భూములు తీసుకుని, రాయితీలు పొంది, ఇలా అక్రమంగా లే ఆఫ్‌లు ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



నక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ సిబ్బంది

నక్కపల్లి: రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ సోమవారం ఐకేపీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లి ఐకేపీ కార్యాలయం నుంచి వారంపు సంత వరకు జాతీయ రహదారిపై ఈ ర్యాలీ సాగింది. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణం చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపరాదని, మైనర్లు డ్రైవింగ్ చేయొద్దని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదంటూ నినాదాలు చేశారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రాజు, సన్యాసిరావు, అప్పారావు, నాగప్రసాద్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ ఆరా



లచ్చన్నపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తున్న టీం సభ్యులతో వైద్య సిబ్బంది

మాకవరపాలెం: వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఆరా తీసింది. మండలంలోని బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలోని లచ్చన్నపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ సభ్యులు పరిశీలించారు. క్లినిక్ పరిధిలో వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను తనిఖీ చేశారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, 19 ఏళ్లలోపు బాలికలకు చేపడుతున్న రక్త పరీక్షలకు సంబంధించిన వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. క్లినిక్‌లోనే గర్భిణులు, బాలింతలు, బాలికలతో మాట్లాడి వారి నుంచి వివరాలు సేకరించారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు డాక్టర్ లూసీ, జగదీష్, రామచంద్రరావు, బూరుగుపాలెం వైద్యాధికారి చరిష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా పశుగణన

- ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో సర్వే
- 16 రకాల జాతుల గుర్తింపు
- పశువుల లెక్కింపు ఆధారంగా వ్యాధులకు మందులు



అనకాపల్లి మండలం పిసినికాడలో పశువుల లెక్కింపు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఐదేళ్లకు ఒకసారి జాతీయ స్థాయిలో నిర్వహించే పశుగణన కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది జోరుగా చేపడుతున్నారు. 21వ జాతీయ పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పశుగణన చేస్తున్నారు. వీరికి ఈ నెల 24న పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలో 52 మంది పశు సంవర్ధక సహాయకులు, ఆరుగురు సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఇంటింటికీ వెళ్లి పశువుల సంఖ్యను లెక్కిస్తున్నారు. ప్రభుత్వం ప్రధానంగా 16 రకాల జాతుల పశువులను గుర్తించేందుకు ఎన్యూమరేటర్ల ద్వారా గ్రామ, పట్టణంలో రైతుల పశువుల పాక వద్దకు వెళ్లి వివరాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తోంది. వివిధ రకాలైన పశువుల పెంపకందారులు ప్రభుత్వ యాప్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల రైతుకు మేలు జరుగుతుంది.

జనాభా లెక్కల మాదిరిగానే..

దేశానికి స్వాతంత్య్రం రాకముందే పశుగణన లెక్కింపు కార్యక్రమం మొదలైంది. జనాభా లెక్కల మాదిరిగానే పశువుల సంఖ్యను లెక్కిస్తారు. నేటి వరకు 20 సార్లు పశుగణన జరిగింది. మొదటి సారిగా 1919-1920లో లెక్కింపు నిర్వహించారు. ఈ ఏడాది 21వ జాతీయ పశుగణన కార్యక్రమం ద్వారా పశువుల వివరాలను సకాలంలో గుర్తించి, మేలు జరిగేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లోని ప్రతి గృహానికి వెళ్లి పశువులు ఉన్నా.. లేకపోయినా వివరాలు తెలుసుకుని స్టిక్కర్లు అతికిస్తున్నారు. వీధి కుక్కలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలను లెక్కించి, పశు వైద్య సంవర్ధక శాఖ అధికారులు మాత్రమే నివేదిక అందజేస్తారు. వీటి ఆధారంగా ఏడాదిలో పశువులకు ఏయే వ్యాధులు సోకుతాయో గుర్తించి ప్రాంతాల వారీగా ప్రభుత్వం వ్యాధి నిరోధక మందులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతుంది.

ఈ పశువులను లెక్కించి, గుర్తిస్తారు..

పశుగణనలో ఆవులు, ఎద్దులు, దున్నలు, కుక్కలు, గాడిదలు, పందులు, కుందేళ్లు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గుర్రాలతోపాటు అనేక రకాలైన పశువులను ఎన్యూమరేటర్లు గుర్తిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపులో ఉన్న పశువులకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తారు. గతేడాది నియోజకవర్గంలో అన్ని రకాల పశువులు కలిపి 7,15,545 లెక్కింపులోకి వచ్చాయి. ఈ ఏడాది పశువుల శాతం పెరిగే అవకాశముందని, రైతులు పశువులకు బీమా చేయించడం వల్ల అవి మృత్యువాత పడిన వెంటనే పశు సంవర్ధక శాఖ అధికారులు పోస్ట్‌మార్టం ఆధారంగా ఇన్సూరెన్స్‌కు అవకాశం కల్పిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో భీమవరం, పెదగుమ్ములూరు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ లైన్‌లో తుప్పులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రీసర్వేలో లోపాల సవరణకు అవకాశం

మునగపాక: రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఉమ్మలాడలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలోని లోపాలను సవరించడంతో పాటు తేడాలను సరిచేసేందుకు సరైన వేదికగా రెవెన్యూ సదస్సులు నిలుస్తాయని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రీ-సర్వే డీటీ పడాల్, ఆర్ఐ కిషోర్‌కుమార్, సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మొల్లేటి కృష్ణవేణి, గ్రామస్తులు మొల్లేటి ఆనంద్, గణేష్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జేపీ అగ్రహారంలో..

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలం జేపీ అగ్రహారంలో సోమవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే విధి విధానాలు, ఇప్పటి వరకూ పూర్తి చేసిన సర్వే, పెండింగ్‌లో ఉన్న సర్వే పనుల గురించి వివరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాసరావు

నర్సీపట్నం: తమ సమస్యల పరిష్కారం కోసం ఎల్ఐసీ ఏజెంట్లు నర్సీపట్నంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏజెంట్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీనివాసరావు, కూరాకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలసీలపై బోనస్ పెంచి, జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. మినిమం రూ.లక్ష పాలసీని ప్రవేశపెట్టాలని కోరారు. పాలసీదారుల రుణాలపై వడ్డీ తగ్గించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు ఐసీఏయూ బేష్ యూనిట్ అధ్యక్షుడు కె.కె.వి.పడాల్, ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అధ్యక్షుడు సోమిరెడ్డి ధనార్జన, ఎల్ఐసీ ఉద్యోగ సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ జాయింట్ సెక్రటరీ అల్లు ప్రకాష్, కోశాధికారి ఎం.అప్పలనాయుడు, 85 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ నిలుపు ఉత్సవం



గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కశింకోట: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి కశింకోట గవరపేటలో ఆది గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిలుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని సంతబయలు ప్రాంతం నుంచి డప్పులు, వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా తీసుకొచ్చి గవరపేటలోని పెద్ద గుమ్మం వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నెలకొల్పారు. అనంతరం పూజలు చేశారు. దీపావళి మరుసటి రోజు నుంచి వచ్చే కార్తీక మాసం నెల రోజులు గౌరమ్మను పూజించి శారదా నదిలో సంప్రదాయ బద్ధంగా నిమజ్జనం చేస్తారు. నిలుపు ఉత్సవంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బీశెట్టి దుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లంటే ఉత్సవ విగ్రహాలా?



మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నూకరాజు

మునగపాక: ప్రజలతో నేరుగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా చూడకుండా తగిన గౌరవం ఇవ్వాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల నూకరాజు డిమాండ్ చేశారు. మునగపాకలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే ప్రతి పని కూడా సర్పంచ్ ద్వారా జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో సర్పంచ్‌లంతా ఐక్యతతో హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్‌ల ప్రొటోకాల్‌కు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సుందరపు తాతాజీ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం సర్పంచ్‌లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతగా పని చేయాలన్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల నూకరాజు, ప్రధాన కార్యదర్శి సుందరపు తాతాజీ, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాచలం

పాయకరావుపేట: విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యు.సింహాచలం అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సోమవారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి మంచి పౌరుడిగా ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్స్‌ను విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు కె.ప్రేమ్‌కుమార్, డి.విద్యాశ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూటలా తరగతుల నిర్వహణ కోసం ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఇంటర్ విద్యార్థులు

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పూటలా తరగతులు నిర్వహించాలంటూ సోమవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వారంతా తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఆందోళన చేసి డీటీ అన్నాజీరావుకు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ కళాశాలలో 200 మంది చదువుతున్నారన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఒక పూటే తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. దీని వల్ల సిలబస్ అర్థం కాకపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రాక్టికల్స్ సరిగా జరగడం లేదన్నారు. రెండు పూటలా తరగతులు నిర్వహిస్తే తప్ప ప్రాక్టికల్స్ సాధ్యపడదన్నారు. ప్రాక్టికల్స్ చెప్పాలంటే తరగతులకు విరామం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో పరీక్షలు జరగనున్నాయని, తక్షణమే రెండు పూటలా తరగతులు నిర్వహించి సిలబస్ పూర్తి చేయాలని కోరారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, రవి, కృపానంద్, లక్ష్మణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో చోరీ

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట గ్రామదేవత మోదకొండమ్మ ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులకు గేటు తాళాలు విరగ్గొట్టి ఉండడం, అమ్మవారి అలంకరణ వస్తువులు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఆలయంలో గ్రామస్తులు భజనలు చేసి వెళ్లగా.. ఉదయం లేచి చూసే సరికి చోరీ జరగడంపై గ్రామస్తులు విస్తుపోయారు. అమ్మవారికి చెందిన అర తులం శతమానాలతో పాటు అర కేజీ వెండి వస్తువులను పట్టుకుపోయారు. సుమారు రూ.1.30 లక్షల విలువైన వస్తువులు దుండగలు పట్టుకుపోయారని ఆలయ సంరక్షకుడు తిరుమలరెడ్డి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు పేకాటరాయుళ్లపై కేసు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం సాయంత్రం యలమంచిలి రూరల్ పోలీసులు దాడి చేశారు. అక్కడ కొంత మంది పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారంతో అదనపు ఎస్ఐ సత్యనారాయణ నేతృత్వంలో సిబ్బంది నిర్వహించిన దాడిలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,100 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు వరాహ నదిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో సోమవారం ఉదయం ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. దీనిని స్టేషన్‌కు తరలించామని, ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.